క్లుప్తంగా

కైలాసపట్నంలో హౌసింగ్ డే నేడు

కోటవురట్ల: కైలాసపట్నంలో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, విధిగా అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అనంతరం సచివాలయంలో అధికారులతో సమావేశం, మండల పరిషత్ సమావేశ మందిరంలో సమీక్ష ఉంటాయని తెలిపారు.

ఘనంగా పోతురాజుబాబు పండగ

కోటవురట్ల : కె.వెంకటాపురంలో పోతురాజుబాబు పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజుబాబు ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నసమారాధన నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొండకర్ల, చోడపల్లిలో భగవద్గీతపై ప్రచారం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, చోడపల్లి గ్రామాల్లో గురువారం త్రైత సిద్ధాంతం–ప్రభోద సమితి, ఇందూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంద్ర, సింధు వేదం వివరణ తెలిపారు. శ్రీనివాస్, సన్నీ,వినోద్, రమణ,దేవి, మంగ, మణి, అక్షయ్‌కుమార్, సర్వదారి పాల్గొన్నారు.

వినాయక ఆలయ కమిటీ చైర్మన్‌గా అప్పలనాయుడు



మునగపాక: మునగపాకలో పేరుగాంచిన పల్లపు వీధి వినాయక ఆలయ కమిటీ చైర్మన్‌గా బొడ్డేడ అప్పలనాయుడు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. బుధవారం రాత్రి ఆలయ నూతన కార్యవర్గం ఎంపిక నిర్వహించారు. చైర్మన్‌గా అప్పలనాయుడు,కార్యదర్శిగా ఆడారి కాశీబాబు,కోశాధికారిగా వేగి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా సూరిశెట్టి కన్నారావు, వేగి కృష్ణ,వెలగా వెంకటప్పారావు,భీశెట్టి ఈశ్వరరావు,సూరిశెట్టి దుర్గునాయుడు,ఆడారి శ్రీనివాస్ తదితరులు ఎంపికయ్యారు.ఆలయ అభివృద్ధికి అందరి సహకారాన్ని తీసుకుంటానని కమిటీ చైర్మన్ అప్పలనాయుడు తెలిపారు.

హుషారుగా 'మా నమ్మకం నువ్వే జగన్'

కోటవురట్ల: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. వైఎస్సార్ సీపీ నాయకులు చేపడుతున్న ఇంటింటా సర్వేలో ప్రభుత్వంపై తమకున్న నమ్మకాన్ని వ్యక్తపరుస్తున్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే రావాలని చెబుతున్నారు. పింఛను డబ్బులు ఒకటో తారీఖునే వస్తున్నాయని అవ్వలు, క్యాలండర్ ప్రకారం సంక్షేమ పథకాల నగదు అకౌంట్లలో జమ అవుతోందని, మహిళలు, నాడు–నేడు ద్వారా పిల్లలకు బంగారు భవిష్యత్ కలుగుతోందని యువకులు చెబుతున్నారు. ఈ పథకాలు ఇంకా కొనసాగాలని, అందుకోసం మళ్లీ జగనే రావాలని స్పష్టం చేస్తున్నారు. బుధవారం రాత్రి కె.వెంకటాపురంలో పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని, సుంకపూరులో చిటికెల బాపన్నాయుడు, చిటికెల ధనలక్ష్మి, రామన్నపాలెంలో కె.గోపాలకృష్ణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అరబుపాలెంలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులతో సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బుజ్జి, ఉపాధ్యాయులు

మునగపాక : మండలంలోని అరబుపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి విద్యార్థులు పాఠశాలలో సందడి చేశారు. వార్షికోత్సవ వేడుకలకు సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బుజ్జి, పీఎంసీ చైర్మన్ మహేష్‌లు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. అలాగే లక్ష్యం కోసం చదువుకోవడం మంచిదన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువులపై దృష్టి సారించాలని, ఉపాధ్యాయులు కూడా బాధ్యతగా పని చేయాలని అన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాసుపత్రులు

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- యలమంచిలి సీహెచ్‌సీలో ఆధునిక వైద్య సేవలు
- టయోటా కంపెనీ ఆర్థిక సహకారంతో వైద్య పరికరాలు



యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో అల్ట్రా సౌండ్ స్కాన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో సేవలందించాలని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. గురువారం అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న టయోటా ఫార్మా పరిశ్రమ ద్వారా రూ.15 లక్షల ఆర్థిక సహాయంతో అల్ట్రా సౌండ్ స్కాన్ మిషన్‌ను యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో ప్రారంభించారు. ఆస్పత్రిలో సిటీజి మిషన్, ఆర్థోపెడిక్ డ్రిల్ మిషన్ రూ.5 లక్షలతో ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని ఇక్కడ పనిచేస్తున్న దిగువ స్థాయి సిబ్బంది సక్రమంగా పని చేయకపోతే తన దృష్టికి తీసుకురావాలని, ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను జాగ్రత్తగా వినియోగించాలని, వైద్య సేవలకు రోగుల నుంచి ఎటువంటి నగదు వసూలు చేయరాదని అన్నారు. ఆస్పత్రిలో మౌలిక వసతులపై సూపరింటెండెంట్ సురేఖ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి ఆవరణలో విద్యుత్ సమస్యపై ఎమ్మెల్యే అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్ ,మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు,అర్రెపు గుప్తా, పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర,కౌన్సిలర్లు గొర్లె వెంకట్, డాక్టర్‌లు బృందం తదితరులు పాల్గొన్నారు.

మీ పనితీరు మార్చుకోవాలి...

యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఇకపై ఎవరిపై అయినా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీతోనే మహిళల సాధికారత

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- యలమంచిలి 11వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



యలమంచిలిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : మహిళల సాధికారతకు పాటుపడేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ 11వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారితో కలసి గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. యలమంచిలి పట్టణంలో రూ.101కోట్లతో తాగునీటి పథకం ద్వారా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని, శాశ్వతంగా మురుగు నీటి సమస్యకు పరిష్కారంగా అమృత పథకం ద్వారా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి ఐదు లక్షల వరకు లబ్ధి చేకూరుతోందని ఇల్లు లేని వారికి సొంత గూడు కల్పించామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే కన్నబాబురాజు సహకారంతో అధిక నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లు దూది నర్సింహమూర్తి, గొర్లె వెంకట్, కర్రి శివ, త్రినాద్, కొఠారు కొండబాబు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి ఎంపీడీవో ప్రసాదరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాలతో వంటల తయారీని పరిశీలిస్తున్న డాక్టర్ రాజేశ్వరి తదితరులు

రాంబిల్లి: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఏయూ న్యూట్రిషన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం. రాజేశ్వరి అన్నారు. దిమిలి గ్రామంలో గురువారం పోషకాహారం–ప్రాధాన్యత–అవశ్యకత అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిరుధాన్యాలు, ఇతర పోషక పదార్థాల ప్రాధాన్యతను వివరించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఆహార పదార్థాలను తినడం ద్వారా ఆరోగ్యంగా వుండవచ్చునన్నారు. చిరుధాన్యాలు ధర కూడా తక్కువగా వుంటుందని అన్నారు. చిరుధాన్యాలు ఇతర పోషక పదార్థాలతో వంటల తయారీపై అవగాహన కల్పించారు. ఏయూ ఎంఎస్సీ విద్యార్థులు పాటలు, నృత్యాలు, నాటికల ద్వారా పోషకాహార విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, టాటా ప్రాజెక్టు మేనేజర్ సాయిచరణ్, ఏసీడీపీవో లలితకుమారి, టాటా ట్రస్టు సమన్వయకర్త అరుణ, విలేజ్ పోలీస్ వెంకటలక్ష్మి, పోషణ సఖిలు మాదల ఉమ, కర్రి దుర్గ, మహేశ్వరి, దేవి, పద్మ, తార, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఇంటింటా సంక్షేమం



పాయకరావుపేటలో పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాలు అమలు పై ప్రజల్లోనూ, బడుగు, బలహీన వర్గాల్లోను ఆనందం వ్యక్తం అవుతుందని జెడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యానారాయణ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్–మా భవిష్యత్తు జగనన్నే అనే కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించి, పథకాల అమలుపై ప్రచారం నిర్వహించారు. పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందిస్తూ, సంక్షేమ పథకాలు విడుదల, వాటిని సద్వినియోగంపై లబ్ధిదారులు అభిప్రాయం మేరకు సీఎం ఫొటోతో ఉన్న స్టిక్కర్‌ను ఇళ్ళకు, డోర్‌లకు అతికించారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించి, అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ ని గెలిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కోరారు. కార్యక్రమంలో పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, నూకరాజు, బెదుకూర్తి రమణ తదితరులు పాల్గొన్నారు. పెంటకోటలో కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ బొలిశెట్టి శ్రీను, జి.అప్పలరాజు పాల్గొన్నారు. అరట్లకోటలో చేపట్టిన కార్యక్రమంలో పార్టీ నాయకులు తూము రమణ, గర్లంక వెంకటసూరి, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.

రాంబిల్లి: జగనన్నతో సంక్షేమం సాధ్యమని హరిపురం సచివాలయ కన్వీనర్ ధూళి అప్పారావు(బుజ్జి) అన్నారు. గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లకు వెళ్లి సంబంధిత ప్రశ్నలు అడిగి సమాధానాలు నమోదు చేసి స్టిక్కర్లు అందజేసారు.వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ ధూళి వెంకీ, రేఖా నందగోపాల్ పాల్గొన్నారు.

ప్రజా రంజకంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన



మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన సువర్ణయుగంగా సాగుతుందని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం వాడ్రాపల్లి సచివాలయ పరిధిలో గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా పారిపల్లెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో నూకరాజు మాట్లాడారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్నపుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో రామజోగినాయుడు, మళ్ల జోగినాయుడు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాలి

మునగపాక : మండలంలోని తోటాడ ఎంపీయూపీ స్కూల్‌తో పాటు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం రహదారి భద్రతా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వైఎస్సార్ క్రాంతి పథం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎం కొండమ్మ మాట్లాడుతూ వాహనాలు నడిపేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. హెచ్ఎం కుమార్‌తో పాటు వెలుగు ఉద్యోగులు,ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న లా కళాశాల కరస్పాండెంట్ వెంకటరావు

మునగపాక : విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని షిర్డీసాయి లా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరావు పేర్కొన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కోర్సు డైరెక్టర్ సత్యనారాయణమూర్తి , సంస్థ ప్రతినిధులు రమణ, దక్షిణామూర్తి, మాడెం జోగారావు, లా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు ప్రసాద్ పరామర్శ



మృతిచెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ప్రమాదవశాత్తూ స్నానానికి దిగి మృత్యువాతకు గురైన విద్యార్థుల కుటుంబ సభ్యులను గురువారం ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పరామర్శించారు.

నాగులాపల్లికి చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు శారదానదిలో మునిగి చనిపోయిన విషయం తెలుసుకున్న ప్రసాద్ బాధిత కుటుంబ సభ్యులను అనకాపల్లి వందపడకల ఆసుపత్రిలో పరామర్శించారు. మృతికి కల కారణాలు అడిగి తెలుసుకొని ఆవేదనకు గురయ్యారు. ఎంతో భవిష్యత్ ఉండాల్సిన పిల్లలు మృత్యువాతకు గురికావడం బాధాకరమన్నారు. తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని కోరారు.

మా నమ్మకం నువ్వే జగన్‌కు ప్రజల్లో ఆదరణ

ఎమ్మెల్యే బాబూరావు



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : ప్రజల నుంచి వస్తున్న ఆదరణ బట్టి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని పార్టీ అధిష్టానం ఈ నెలాఖరు వరకు పొడిగించిందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. గురువారం ఆయన ఉద్దండపురంలో విలేకర్లతో మాట్లాడారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, స్థానిక నాయకులు సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందన్నారు. నియోజకవర్గంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, స్థానిక నాయకులు ఈ కార్యక్రమాన్ని ఎంతో బాధ్యతగా తీసుకుని ఇంటింటికి తిరిగి ప్రజా మద్దతు కోరడం అభినందనీయమన్నారు. వెళ్లిన ప్రతి ఇంటి వద్ద జగనన్న ప్రభుత్వం వల్ల లబ్ధిపొందిన వారు స్వచ్ఛందంగా తమకు మద్దతు ప్రకటిస్తున్నారని, మళ్లీ జగనన్నను సీఎంను చేసుకుంటామని చెబుతున్నారన్నారు. ఇంతకంటే ప్రజాదరణ ఏంకావాలన్నారు. ప్రజలు మనకు ఇస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ సూచించిన 8296082960 ఫోన్ నంబరుకు లక్షలాదిగా మిస్‌కాల్స్ రావడం గొప్ప విషయమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, సర్పంచ్‌లు వెంకటేష్, వెదుళ్ల వరలక్ష్మి, ఎంపీటీసీలు బచ్చలరాజు, పక్కుర్తి రమణ, పార్టీ నాయకులు శీరం నర్సింహమూర్తి, బొల్లం బాబ్జి, సూరాకాసుల గోవిందు, బచ్చల దొరబాబు, కోమర్తి బాబూరావు, కురందాసునాని ఉన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



ఉద్దండపురంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురంలో మరిడమ్మ అమ్మవారిని గురువారం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ తదితరులు దర్శించుకున్నారు. గంధం అమావాస్యను పురస్కరించుకుని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు సౌకర్యంగా కమిటీవారు షామియానాలు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల జరిగింది. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, మణిరాజు, సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ బచ్చలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబ్జి, శీరం నర్సింహమూర్తి, సూరాకాసుల గోవిందు ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం



రాజయ్యపేటలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న కాసులమ్మ

నక్కపల్లి: మత్స్యకారులకు ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించి తగిన గుర్తింపు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని నక్కపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు, మత్స్యకార నేత గోసల కాసులమ్మ అన్నారు. గురువారం ఆమె రాజయ్యపేట, బోయపాడు తదితర గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజామద్దతు కోరారు. పలువురు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వేటనిషేధ సమయంలో మత్స్యకార భరోసా కింద రూ.10వేలు నష్టపరిహారం చెల్లిస్తున్నారని, ఇళ్లు లేని వారికి స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేసారని తెలిపారు. మా మద్దతు జగనన్నకే అని వివరించారు. కాసులమ్మ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో మత్స్యకారులను ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మత్స్యకారులంతా జగనన్నకు అండగా నిలబడి మళ్లీ సీఎంను చేసుకోవాలన్నారు.పథకాలు వల్ల లబ్ధిపొందిన వారి వివరాలు ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేసి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు, ఈ కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



ఫైర్ ఫైటింగ్ పరికరాల గురించి వివరిస్తున్న అగ్నిమాపక అధికారి రాంబాబు

యలమంచిలి : విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగహన అవసరం అని యలమంచిలి అగ్నిమాపకాధికారి రాంబాబు అన్నారు.జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కార్యాలయం వద్ద పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ప్రమాదాలను టెక్నాలజీతో కూడిన పరికరాలతో ఏవిధంగా ప్రమాదాలను అరికట్టాలో విద్యార్థులకు ఒక నమూనా ప్రదర్శనలో చూపారు.

ఫైర్ జరిగేటప్పుడు ఎక్విప్‌మెంట్ ఏవిధంగా అమర్చుకోవాలో విపులంగా విద్యార్థులకు వివరించారు. పట్టణంలోని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని పోర్టల్ యాప్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంధం అమావాస్య



కొరుప్రోలులో అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు



దేవవరంలో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నక్కపల్లి : గంధ అమావాస్య పండగను గురువారం భక్త జనం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. నక్కపల్లి, వేంపాడు, ఉద్దండపురం, దేవవరం, సారిపల్లిపాలెం, చినతీనార్ల, గొడిచర్ల, గుల్లిపాడు తదితర గ్రామాల్లో ఉదయం నుంచి అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కానుకలు, మొక్కుబడులను పసుపు కుంకుమలను తీసుకుని అమ్మవారి ఆలయాలకు ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి కోళ్లు, మేకలు బలి ఇచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం భజన కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా జాతరలు

ఎస్.రాయవరం: మండలంలో గంధం అమావాస్య జాతర వేడుక ఘనంగా నిర్వహించుకున్నారు. ఎస్.రాయవరంతో పాటు కొరుప్రోలు,పేట సూధిపురం గ్రామాల్లో కూడా వైభవంగా జాతర నిర్వహించారు. వేకువ జామునుంచి నూకాంబిక అమ్మవారి ఆలయాలకు భక్తులకు పోటెత్తారు. భక్తులు ఆచార సాంప్రదాయలతో మొక్కులు చెల్లించుకున్నారు. కొరుప్రోలు అమ్మవారి ప్రభలు అలంకరించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరులు అగ్ని గుండములు తొక్కి మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్.రాయవరంలో అమ్మవారి ఊరేగింపులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారి గరగలను పలువురు నెత్తిన పెట్టుకుని ఆనందించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నూకాంబిక సన్నిధిలో ఎంపీ దంపతులు

గంధం అమావాస్య జాతర సందర్భంగా అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి దంపతులు గురువారం నూకాంబిక ఆలయానికి విచ్చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఎంపీ స్థానికులను పలకరించారు. ఈ సందర్భంగా వారు గ్రామ సమస్యలు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎంపీపీ శారదాకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు,ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

గ్రామాల్లో జాతరలు ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకునేలా చేస్తున్నాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గంధ అమావాస్య పురస్కరించుకుని కొరుప్రోలు, ఎస్.రాయవరం గ్రామాల్లో జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అమ్మవారిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లక్కోజు ఆదిమూర్తి, మైలారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం



కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

కోటవురట్ల : మండల కేంద్రంలో సీఫా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవం నిర్వహించారు.గ్రీన్ అంబాసిడర్లు సీఫా కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టి పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఫా సంస్థ డైరెక్టర్ శశిప్రభ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ ప్రశాంతంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌కుమార్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జైభారత్ జైహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు, సచివాలయ జిల్లా కో ఆర్డినేటర్ ప్రసాద్, డాక్టరు అన్నపూర్ణ పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో 15 కోవిడ్ యాక్టివ్ కేసులు

రాంబిల్లి : మండలంలో 15 యాక్టివ్ కేసులున్నాయని రాంబిల్లి , దిమిలి వైద్యాధికారులు డాక్టర్ అమృతసాయి, డాక్టర్ వెంకటేష్ తెలిపారు. గురువారం రాంబిల్లి పీహెచ్‌సీలో నలుగురికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్ నిర్ధారణ జరిగినట్టు డాక్టర్ అమృతసాయి తెలిపారు. దీంతో రాంబిల్లి పీహెచ్‌సీ పరిధిలో మొత్తం ఐదు యాక్టివ్ కేసులున్నాయన్నారు. రాంబిల్లిలో , గొరపూడి, వెంకయ్యపాలెం, పెదకలవలాపల్లి, కొప్పుగొండుపాలెంలో ఒక్కో కేసు నిర్ధారణ జరిగిందన్నారు. ఇక దిమిలి పీహెచ్‌సీ పరిధిలో దిమిలిలో 3, మర్రిపాలెంలో 2, తెరువుపల్లిలో 2, కొత్తూరు, పంచదార్ల, మామిడివాడలో ఒక్కో కరోనా పాజిటివ్ కేసు నిర్ధారణ జరిగిందన్నారు. మండలంలో కరోనా సోకిన వారిని హోం ఐసోలేషన్‌లో వుంచి వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు.